బీఆర్ఎస్ నాయకుడికి రాజయ్య పరామర్శ

లింగాలఘనపురం, మే 12: వడిచర్లకు చెందిన బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు గండి యాదగిరిని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం పరామర్శించారు. వడిచర్ల తాజా మాజీ ఎంపీటీసీ గండి యాదగిరి తల్లి గండి పోష ఎల్లమ్మ వృద్ధాప్యంతో మృతిచెందింది. రాజయ్య ఆమె పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చౌదరపెల్లి శేఖర్, అంతగల్ల రాంచందర్, గట్టగల్ల శ్రీహరి, ఉడుగుల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోషెల్లమ్మకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

పట్టాలిచ్చిన అసైన్డ్ భూమిని లాక్కోవద్దు

బీఎస్పీ నాయకులు శ్రీశైలం, గణేశ్

మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా నాయకులు

దేవరుప్పుల, మే 12: మండలంలోని చినమడూరులో నిరుపేదలకు కేటాయించి పట్టాలిచ్చిన అసైన్డ్ భూమిని తిరిగి లాక్కొనే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని బహుజన సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక శ్రీశైలం, పాలకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చింత గణేశ్ అన్నారు. చినమడూరు రెవెన్యూ పరిధిలోని రాంభోజీగూడెం పేదలకు కేటాయించి పట్టాలిచ్చిన భూములను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో 524 సర్వే నంబర్ నుంచి 527 వరకు 40 ఎకరాలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ ముఖ్యమంత్రిగా ఉండగా 68 మంది 18 గుంటల చొప్పున ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలైన నిరుపేద రైతులకు కేటాయించి పట్టాలు ఇచ్చిందని తెలిపారు. కేసీఆర్ పాలనలో సర్వే నంబర్ 527లో మరో 25 మందికి 18 గుంటల చొప్పున కేటాయించి పట్టాలు ఇవ్వగా, పాస్‌పుస్తకాలు రాగా రైతుబంధు కూడా అందిందని వివరించారు. ప్రస్తుతం ఈ భూముల్లో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం మంజూరు కాగా రూ.130కోట్ల నిధులు కేటాయించారని, పట్టా భూములు రైతుల అనుమతి లేకుండా ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. రైతులు పాలడుగు యాదగిరి, మహంకాళి మధు, ఇటికాల నవీన్, దుబ్బాక శ్రీనివాస్, బాషిపాక ఎల్లయ్య ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

పాలకుర్తి, మే 12: పంచాయతీ కార్యదర్శులు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్ స్వరూపరాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకుర్తి, కొడకండ్ల మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గడువు పెంచినందున ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించాలన్నారు. తడి పొడి చెత్త సేకరించి ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ ఇంకుడు గుంతలు తీయాలన్నారు. ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంపీఓ రవీందర్, ఏపీఓ మంజుల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ఎన్ స్వరూపరాణి

మహిళలు అభివృద్ధి సాధించాలి

బచ్చన్నపేట, మే 12 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ డెరెక్టర్ పీ రజితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సాల్వాపూర్‌లో ఏపీఎం నాగేంద్రప్రసాద్, టీచర్ నీరజ, సీసీ నర్సింహులు, వీఓ అధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో మహిళలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకోగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఉపాధి, ఉద్యోగ రంగాలపై దృష్టిసారించాలన్నారు.

కుట్టుశిక్షణ సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో రజితారెడ్డి

కొడకండ్లలో కొనుగోలు కేంద్రం తనిఖీ

తనిఖీ చేసిన ఎమ్మెల్యే యశస్వినీ

కొడకండ్ల, మే 12: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అధికారులు, మిల్లర్స్‌తో మాట్లాడి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పద్మశాలీ భవన్‌లో ప్రతిభా పురస్కారాలను ఎమ్మెల్యే అందజేసి సన్మానించారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

రఘునాథపల్లి, మే 12: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కావటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కంచనపల్లి, ఖిలాషాపురం, అశ్వరావుపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కావటి యాదగిరి పలువురు నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెలరోజులు గడుస్తున్నా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని మండిపడ్డారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతుంటే నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కాంటాల సంఖ్య పెంచి వేగంగా కొనుగోళ్లు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల నాయకులు నాల్కపల్లి దావీదు, మడికంటి సోమన్న, కందుకూరు మల్లేశం, పసుల డానియేలు, చిట్యాల ఉప్పలయ్య, నీలారపు సాంబయ్య, కాగితాల రాములు, ముప్పిడి ఎల్లయ్య, గొంగళ్ల వెంకటయ్య, సురుగు రమేశ్, నాగేశ్ ఉన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

'గ్రీవెన్స్ సెల్'లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ప్రజావాణిలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మే 12: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో 47 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. బచ్చన్నపేట మండలం ఆలింపూర్‌లో ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని మరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, దాన్ని రద్దు చేసి తన పేర పట్టా నమోదు చేయాలని కరీంనగర్ జిల్లాకు చెందిన రాజేశ్వర్‌రావు అర్జీ అందజేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన క్రాంతి కుమార్ రేషన్ కార్డు ఇప్పించాలని వినతిపత్రం సమర్పించాడు. జనగామ మండలం పెద్దపహాడ్‌కు చెందిన దివ్యాంగుడు ప్రశాంత్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విన్నవించాడు. జిల్లాలోని గ్రోమోర్, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ విత్తన, ఎరువుల, క్రిమిసంహారక మందుల దుకాణాల యజమానులు వారి షాపుల్లో స్టాక్ వివరాల, ధరల పట్టిక వివరాలు బోర్డుపై ప్రదర్శించేలా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలెక్టర్ విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కొనసాగుతున్న సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తి చేసి తుది జాబితా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు సమర్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. ఎల్ఆర్ఎస్ పేమెంట్ పూర్తి చేసిన దరఖాస్తుదారులకు వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను మండల స్పెషల్ ఆఫీసర్లు సందర్శించి, విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఆర్డీవో గోపీరామ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్డీవో వసంత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఏవో రామారావు నాయక్, డీపీవో స్వరూప పాల్గొన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

- **ఇప్పటివరకు అందిన ఫిర్యాదులు 426.. అందులో పరిష్కరించినవి 361**
- **విద్యుత్‌శాఖ ఎస్ఈ టీ వేణుమాధవ్**

విద్యుత్ ప్రజావాణిలో మాట్లాడుతున్న జనగామ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టి వేణుమాధవ్

జనగామ, మే 12 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనగామ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టి.వేణు మాధవ్ తెలిపారు. సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి వాటిని సకాలంలో పరిష్కరిస్తున్నామని, 2024 జూన్ 17న ప్రారంభమైన గ్రీవెన్స్‌కు ఇప్పటివరకు 426 ఫిర్యాదులు రాగా, 361 పరిష్కరించామని తెలిపారు. ప్రధానంగా విద్యుత్ బిల్లులు, మీటర్లు, సరఫరాలో హెచ్చుతగ్గులు, కేటగిరి మార్పు, పేరు మార్పు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు వంటివి ఉంటున్నాయని, సమస్య తీవ్రత ప్రకారం అప్పటికప్పుడు, లేకుంటే టైమ్ తీసుకొని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని పటిష్టం చేసేందుకు సమీక్షలు నిర్వహించి వినియోగదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కారించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్

రోడ్డు ప్రమాదం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

బచ్చన్నపేట, మే 12 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో తరచు రోడ్డు ప్రమాదాలు జరిగే పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం సీఐ అబ్బయ్య, ఎస్సై హమీద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో ఇటీవల ఒకరు మృతిచెందిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్సైకి సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగించాలన్నారు.

ఐలమ్మ నగర్‌లో ఇంటి నంబర్లు కేటాయించాలి

జనగామ చౌరస్తా, మే 12: జనగామ పట్టణంలోని చాకలి ఐలమ్మ నగర్ (ఇందిరమ్మ 3వ విడత లబ్ధిదారుల కాలనీ)లో ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న వారికి మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో 3వ విడత ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ 2012-13 సంవత్సరంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాదారులకు రూ.5లక్షల గృహ రుణాన్ని ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. లేదంటే లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా, పట్టణ నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, బూడిద గోపి, బాల్నె వెంకటమల్లయ్య, గౌసియా, కమల, బండ సౌందర్య, జయ, రజిత, అంజమ్మ, రజిత, మల్లేశ్, సుజాత, కవిత, శ్రీలత, శాంత, వెంకటేశ్, సుధాకర్, బాలస్వామి, పద్మ, మమత పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

జనగామ, మే 12 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు జనగామ డిపో నుంచి ఈనెల 15 నుంచి 26 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎస్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ నుంచి కాళేశ్వరానికి పెద్దలకు రూ.390, పిల్లలకు రూ.220 చార్జి ఉంటుందని, హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి పెద్దలకు రూ.570, పిల్లలకు రూ.320 చార్జి ఉంటుందని వివరించారు. ఉప్పల్ ఎక్స్‌రోడ్డు నుంచి కూడా కాళేశ్వరానికి డీలక్స్ బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పెద్దలకు రూ.670, పిల్లలకు రూ.370 చార్జి నిర్ణయించామని తెలిపారు. పుష్కరాలకు వెళ్లే భక్తులు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, సమాచారం కోసం 7382926139 లేదా 7382852818 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మృతుడు సిద్దులుకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పీఏ పరమేశ్‌కు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, మే 12: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యక్తిగత సహాయకుడు కొలనుపాక పరమేశ్ తండ్రి సిద్దులు సోమవారం స్వగ్రామం జనగామ మండలం వడ్లకొండలో అనారోగ్యంతో మృతిచెందాడు. ఎర్రబెల్లితోపాటు బీఆర్ఎస్ నాయకులు వెళ్లి సిద్దులు మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం పీఏ పరమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ దేవరుప్పుల మండల నాయకులు పల్లా సుందర రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, తీగల దయాకర్, బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, ఆలకుంట్ల యాదగిరి, శీల తిరుమలేశ్, సుడిగెల హనుమంతు, కుతాటి నర్సింహులు, మేకల సంపత్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో డీఎస్ వెంకన్న

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన భూ భారతి చట్టం అమలులో జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా సోమవారం మండలంలోని శివునిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ సాదాబైనామా, మిస్సింగ్ సర్వే నంబర్లు, పెండింగ్ మ్యూటేషన్, విస్తీర్ణంలో తేడాలు, వారసత్వానికి సంబంధించిన సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమన్ నాయక్, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

జనగామలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

అందాల పోటీలు రద్దు చేయాలి

ఐద్వా ఆధ్వర్యంలో జనగామ నెహ్రూపార్క్ వద్ద నిరసన

జనగామ చౌరస్తా, మే 12: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, ఎండీ షబానా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ అందాల పోటీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలతో ఇండియాకు ఉన్న పేరు, ప్రతిష్టలు దిగజారుతాయని పేర్కొన్నారు. ఓ వైపు ఇండియా – పాక్ యుద్ధం జరుగుతుండగా ఐపీఎల్ క్రికెట్ పోటీలను రద్దు చేసుకోగా, అందాల పోటీలను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు రద్దు చేయొద్దో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా అందాల పోటీలు నిర్వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు భవాని, కల్యాణి, వరలక్ష్మి, శ్రీలత, బాలమణి, నాగమణి, విజయ, పరమేశ్వరి, లక్ష్మి, మణెమ్మ పాల్గొన్నారు.

13.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ

ఆర్టీసీ బస్‌లో ప్రయాణికురాలి బ్యాగు అపహరణ

రఘునాథపల్లి, మే 12: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ వద్ద సుమారు 13.5 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్సై దూదిమెట్ల నరేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంకు చెందిన చిత్తలూరి మమత హనుమకొండలోని తన అన్న ఇంటి వద్ద ఉన్న మనువడిని తీసుకువచ్చేందుకు భువనగిరిలో ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. రఘునాథపల్లి బస్టాండ్‌కు చేరుకుంటుండగా బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును చూసుకోగా కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారని స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. బ్యాగులో సుమారు 13.5 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

15 నుంచి దూరవిద్యా కేంద్రం ఎంఎల్ఐఎస్సీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, మే 12 : కేయూ దూరవిద్యా కేంద్రం ఎంఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. 15న మొదటి పేపర్, 17న రెండో, 19న మూడో, 21న నాలుగో పేపర్ ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. బీఎల్ఐఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు 15న మొదటి పేపర్, 17న రెండో, 19న ప్రాక్టికల్స్, ఎంఎల్ఐఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు 15న, 17, 19న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14న నెట్‌బాల్ సెలక్షన్స్

హనుమకొండ చౌరస్తా, మే 12 : రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ బాలబాలికల సబ్ జూనియర్ సెలెక్షన్స్ ఈ నెల 14న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, వైస్ ప్రెసిడెంట్ లిల్లీ ఫ్లోరెన్స్, సెక్రటరీ సూర్యారావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9885965703, 9618270940 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
- **బంజారా భవన్, వంద పడకల ఆస్పత్రి శిలాఫలకాల ఆవిష్కరణ**

వంద పడకల ఆస్పత్రి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్ ఘన్‌పూర్, మే 12 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న బంజారా భవన్, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గిరిజన తండాలకు రూ.77కోట్లతో పక్కా రోడ్ల నిర్మించామని, సుమారు 20 తండాలకు 38కిలోమీటర్ల మేర బీటీ వేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని సుమారు 17వేల గిరిజన జనాభా కోసం నియోజకవర్గ కేంద్రంలో రూ.2కోట్లతో బంజారా భవన్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా గ్రామ పంచాయతీలైన ఎనిమిది తండాలకు రూ.కోటి 60లక్షలు మంజూర్యాయని, నియోజకవర్గ కేంద్రంలో రూ.63లక్షలతో ఎస్టీ హాస్టల్ భవన నిర్మాణ పనులు పూర్తి కాగా త్వరలోనే ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు. బంజార భవన్ వద్ద లెవలింగ్, డైనింగ్ హాల్ నిర్మాణానికిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.70కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, డాక్టర్ అజయ్‌కుమార్, మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్..

- **నేడు పాలీసెట్**
- **జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు**
- **హాజరు కానున్న 1,416 మంది**
- **నిమిషం నిబంధన అమలు**

జనగామ చౌరస్తా, మే 12: ఇంజినీరింగ్ డిప్లొమా, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ, వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం జరిగే పాలీసెట్ 2025కు అధికారులు జిల్లాలో సర్వం సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగుతుందని పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 1,416 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల సెంటర్‌లో 576 మంది, సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో 480 మంది విద్యార్థులతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 360 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు. పరీక్షకు విద్యార్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తోపాటు హెచ్‌బీ బ్లాక్ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పెన్‌తో మాత్రమే రావాలని జిల్లా కోఆర్డినేటర్ నర్సయ్య పేర్కొన్నారు. పరీక్ష సమయం కన్నా నిమిషం ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని సూచించారు. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నర్సయ్య

కొనుగోళ్లు ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు

- **కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**
- **'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్**

పాలకుర్తి/ చిల్పూరు, మే 12: ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ హెచ్చరించారు. 'అధికార పార్టీ వారికే కాంటాలు' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అదనపు కలెక్టర్‌తో పాటు సివిల్‌సప్లై అధికారులు స్పందించి, పాలకుర్తి మండలం గూడూరు, పాలకుర్తి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోళ్లలో నిర్వాహకులు ఆలసత్వం వహించొద్దని చెప్పారు. కాంటాలైన రైతుల డబ్బులు అకౌంట్లలో వెంటనే పడేల